గ్లోబల్ హాస్పిటల్స్ - ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన సామాజిక కథ



"మాకూ ఓ గది కావాలి. ఎటాచ్డ్ బాత్రూంతో" అన్న గొంతు విని చివ్వున తలెత్తారంతా.

శ్యామలాంబ విసవిసా లోనికి వెళ్లిపోయింది.

సాలోచనగా, విస్మయంగా చూశారు భగీరథరావుగారు.

# మాకూ ఓ గది కావాలి

## ఉపద్రష్ట కృష్ణప్రియ

ఆయన ఈ మధ్యకాలంలోనే రిటైరవడమూ, అందవలసిన అమౌంట్స్ అందడమూ జరిగాయి. వారికి ఇద్దరు మగపిల్లలూ, ఒక ఆడపిల్లా. అందరికీ పెళ్లిళ్లైనాయి. భగీరథరావుగారికి ఎప్పటినుంచో ఓ చక్కని ఇల్లు కట్టుకోవాలని కోరిక ఉంది. దాని గురించే కొడుకులూ, కోడళ్లూ, ఆయనా రోజూకోరకంగా చర్చలు జరిపి ఎస్టిమేట్స్ వేస్తున్నారు. ఆయనకి గాజువాకలో ఓ నాలుగొందల గజాల స్థలముంది.

"ఈ మాట 'శ్యామలాంబే అన్నదీ' అంటే నమ్మశక్యం కాలేదాయనకి, ఓ క్షణం.

ఆమె చాలా రోజులబట్టీ 'మనకీ ఓ గది సెపరేట్‌గా కావాలి' అని గొణుగుతూనే వుంది గానీ, మరీ ఇంత నిస్సిగ్గుగా, నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా అడుగుతూ వుంటే, ఎప్పుడో చదువుకున్న వర్జీనియా వుల్ఫ్ పుస్తకం 'ఏ రూమ్ ఆఫ్ వన్స్‌వోన్' ఠక్కున గుర్తుకు వచ్చింది. 'అంత ఫోర్సు'గా అడిగిందావిడ.

మగపిల్లలిద్దరూ తండ్రి ఏమంటారోనని చూడసాగారు. కోడళ్లు మూతులు ముడుచుకుని లోనికి వెళ్లడం ఆయన కళ్లబడకపోలేదు. "అంటే, కనీసం ఓ యాభై వేలన్నా కావాలి, అదనంగా" అయిష్టంగా అన్నాడు పెద్ద కొడుకు, రమణ.

"ఫ్లోరింగ్ కాస్ట్లీగా ఉండాలనుకుంటున్నాం కాబట్టి, ఇంకా పైకే దేకవచ్చు. ఏమంటారు నాన్నగారూ?" అన్నాడు చిన్నకొడుకు రవి.

ఎందుకోగానీ ఆయనకి చాలా సిగ్గేసి అనీజీగా అనిపించడంతో మౌనంగా ఉండిపోయారు. రమణా, రవీ సొజ్జలు చేసుకుని "మళ్లీ రేపు కలుద్దాం" అంటూ వెళ్లిపోయారు.

రాత్రి అందరూ హాల్లో సీరియస్‌గా సీరియల్స్ చూస్తున్నా శ్యామలాంబ మాత్రం లోపలకి రాకుండా, పెరట్లో తులశమ్మ దగ్గరే మంచం వేసుకుని పడుకుంది. భగీరథరావు గారికి మాత్రం చాలా వెలితిగా అనిపించింది మొదటిసారిగా. టైం పదిన్నర అయ్యాక ఎవరి గదుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

హాల్లోనే ఆయన పడక. అక్కడ వున్న మంచంమీద దుప్పటి అందరూ ఎక్కి తొక్కడంవల్ల నలిగిపోయింది. 'దుప్పటి మారిస్తే బాగుండేది.' అనిపించి అటూ, ఇటూ చూస్తున్న ఆయన కళ్లకి, ఎప్పుడు వచ్చిందోగానీ, కొంగు పరుచుకుని వంటింట్లో ముడుచుకుని పడుకున్న శ్యామలాంబ కనబడింది.

"శ్యామలా" అన్నారాయన. ఆవిడ కొంచెం కూడా కదల్లేదు. ఆయనకి ఇప్పటికీ ఆవిడతో ఏకాంతంగా మాట్లాడాలంటే ఎలాగో ఉంటూ ఉంటుంది, అది ఎంత చిన్న విషయమైనా సరే. ఆవిడే అతని మనసెరిగి అన్ని పనులూ చక్కబెట్టడం వల్లనో యేమో, ఆయన పెద్దగా తనగురించి గానీ, ఆమె గురించి గానీ పట్టించుకునే అవసరం కలగలేదు.

"అలా కదలకుండా పడుకుందంటే ఇక, ఇవాళ తన గురించి పట్టించుకోదన్నమాట." అనుకున్నారాయన. కానీ, ఆవిడ ఠక్కునలేచి వంటింట్లో మడికి ఆరబెట్టుకున్న చీర నాలుగు మడతలుచేసి మంచంమీద వేసి, మౌనంగా తన స్థానంలోకి వెళ్లి పడుకుంది.

"నలుగురూ నవ్విపోతారన్న ఇంగితం కూడా లేకుండా ఏమిటండీ ఆవిడ అలుగుడూ? ఈ వయసులో "మాకూ ఓ గది కావాలి" అని ఆవిడ అంటూ వుంటే సిగ్గుతో నా ఒళ్లు చచ్చిపోయిందనుకోండి. ఛ. ఛ." గట్టిగానే అంటోంది పెద్ద కోడలు ప్రభ.

"నోర్ముయ్యి. వాళ్లు వింటే బాగోదు." పెద్దకొడుకు రమణ.

"అర్ధరాత్రిళ్లు దొంగతిళ్లు తినడం అలవాటు కదా! అందుకుగానీ అలా కావాలంటున్నారేమో అక్కయ్యా అంది సుమతి తెలుసా?" అంది ప్రభ మళ్లీ.

"నోర్ముయ్యి. ఇంకో మాట పీకలోంచి వచ్చిందంటే..." గర్జించాడు రమణ.

గతుక్కుమన్నారు భగీరథరావుగారు.

"ఏమిటో పాడు అలవాటు. చిన్నప్పుడు నాయనమ్మ నిద్రలేపి మరీ అవీ యివీ పెట్టేది. ఓ రాత్రివేళ మెళుకువ వచ్చి ఏదైనా నోట్లో వేసుకుంటేగానీ నిద్రపట్టి చావదు. ఆ మధ్య యేమీ లేకపోతే శ్యామల నాలుగు సగ్గుబియ్యం వడియాలు వేయించింది. దీని రిఫరెన్స్ అదే అయివుంటుంది." అనుకున్నారు.

శ్యామలాంబ గుండె కలుక్కుమంది. "మాకూ ఓ గది కావాలనడం ఏమంత తప్పుమాట? ఆయన ఎలాగూ నోరు విప్పి ఏ సంగతీ చెప్పరు. అందుకోసం పిల్లలముందు తాను నోరు విప్పక తప్పలేదు. తమ సంపాదనతో తాము కట్టుకుంటున్నారు. అందులో తమకీ ఓ

గది కావాలంటే అందరూ ఎందుకిలాగ పీక్కుంటున్నారు?

పెళ్లైన నాటినుంచి చూస్తోంది తాను 'తమదీ' అని చెప్పుకుని స్వతంత్రంగా మసలగలిగే ప్రదేశమే లేదు తమకి.

పెళ్లికి తనకి పదహారేళ్లు. ఆయనకి ఇరవైమూడు. అప్పటికే స్కూల్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నారాయన. బావగార్లిద్దరూ వ్యవసాయం చేసుకునేవారు. మావగారు పెళ్లినాటికి లేరు.

ఇల్లు పెద్దదే, గానీ వంటగదీ, స్టోరుగదీ, హాలూ తప్పించి రెండు గదులుండేవి. ఆ రెండు గదులూ ఎప్పుడో పెళ్లిళ్లైపోయిన బావగార్లు ఆక్రమించుకున్నారు. ఈయనా, అత్తగారూ పెరట్లోనో, వాకిట్లోనో, హాల్లోనో రెండు నులక మంచాలేసుకుని కాలక్షేపం చేసేవారు. తమ పెళ్లైనాక కొట్టుగది తమకి పడుకుందికి సిద్ధం చేశారు. పగలల్లా అది అందరూ తిరిగే స్టోరు రూము.

ఆ రోజు మధ్యాహ్నం బావగార్లిద్దరూ పొలంలోనే ఉండిపోయారు. తోటికోడళ్లిద్దరూ, ఎవరి గదుల్లో వారు 'సులోచనా రాణి' నవలలు తిరగేస్తున్నారు.

కొట్టుగదిలో ఎలకల పోరు విపరీతంగా ఉండడంవల్ల చిరాగ్గా ఉండేది. సామాన్లు చక్కగా సర్దితే రాత్రిళ్లు కాస్త హాయిగా పడుకోవచ్చని సర్దుతోంది తాను. ఎప్పుడు వచ్చారో ఏమో 'వరద గోదారి' లా తనని చుట్టేశారు



ఆయన. 'కెవ్వు' మనబోయిన తననోరు గట్టిగా మూసేసారు. అలికిడికి "ఎవర్రా అదీ!... అమ్మాయ్ శ్యామలాంబా?" అంటూ గది బయట అత్తగారి గొంతు వినబడగానే ముచ్చెమటలు పోసేసాయి తనకి. ఆనందమంతా క్షణంలో ఆవిరైపోయినట్లయింది.

"ఏవో బుక్స్ మర్చిపోయాను" అంటూ బయటకి వెళ్లిపోయారాయన.

నాడూ నాడూ ఎరగవమ్మో, ఈ పట్టపగలు భాగోతాలు అని అత్తగారు సణుగుతూ వుంటే, తోటికోడళ్లు కిసుక్కున నవ్వడం తనకి ఈనాటికీ గుర్తు వుంది.

ఆనాడే గట్టిగా ఒక వూహ కలిగింది. "తమకీ ఒకరూం సెపరేట్‌గా వుంటే ఎంత బాగుండును?" అని అలాగే ముగ్గురు బిడ్డల తల్లయింది.

అత్తగారు గతించాక, ఎవరికి వారు విడిపోయి ఉద్యోగం చేసుకుంటున్నారన్న మిషమీద ఇంట్లో భాగం లేకుండా చేశారు బావగార్లు, ఒక ఎకరం పొలం ఇచ్చి.

అప్పుడు అద్దె ఇంట్లోకి మారారు తాము. ఎదుగుతున్న పిల్లల మధ్య ఇరుకుగదుల్లో గడిచింది కాలం. స్కూలునుంచి 'కాఫీ' మిషమీద వచ్చి విధిగా మధ్యాహ్నం ఓ గంట గడిపేవారు ఈయన.



ఆ తరువాత వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయింది. అప్పుడైనా 'డబల్ బెడ్ రూం' ఉన్న ఇల్లు తీసుకోమని గట్టి పట్టుపట్టింది తాను. అలాగే తీసుకున్నారాయన. "థాంక్యూ డాడీ. నాకో స్టడీరూం కావాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను." అని పెద్దాడో రూంలో సర్దుకుంటే "నాకు స్టడీ రూం" కావాలని రెండోవాడు రెండో రూంలో సర్దుకున్నాడు. "మరి నాకో" అంటున్న కళ్యాణిని దగ్గరికి తీసుకుని 'మనకి హాయిగా టీవీ రూం ఉందిగా' అని ఆయన అంటూ నిస్సహాయంగా చూస్తూ వుంటే నవ్వేసింది తాను.


తామెంత తాపత్రయపడ్డా, పెద్దాడికీ, చిన్నాడికీ కూడా ఇంజనీరింగ్‌లో మెరిట్ సీట్లు రాలా. అదృష్టం కొద్దీ పెద్దాడికి కోర్టులో టైపిస్టుగా జాబ్ వచ్చింది. చిన్న వాడికి ఎక్కడా కలిసిరాక ఓ మెడికల్ షాప్ పెట్టుకున్నాడు. డిగ్రీ కాగానే కళ్యాణిని ఓ లెక్చరర్ చేతిలో పెట్టేటప్పటికి తాతలు దిగివచ్చారు. మగపిల్లలిద్దరికీ కూడా తగిన సంబంధాలు చూసి చేసేసారు తాము. కోడళ్లిద్దరికీ గదులు చక్కగా అమిరాయి. చిన్ననాడు తోటికోడళ్లు అథార్టీ చెలాయిస్తే, ఇప్పుడు సొంత కోడళ్లు.

"నోరు తెరిచి ఇది కావాలీ అని ఈయన చెప్పకపోవడం వల్ల, తిండి విషయమైతేనేమి, టీవీ చూసే విషయమైతే నేమి, బట్టల విషయమైతేనేమి స్వతంత్రత కోల్పోయారు తాము. ఇంటి పెత్తనం మెల్లిమెల్లిగా పెద్దకోడలు చేతిలోకి మారింది."

ఏ పిండి వంటలు చేసినా మూడు వాటాలు వేస్తుంది పెద్దకోడలు. రెండు వాటాలు వాళ్లిద్దరికీ, తమకో వాటా అని ఆమె ఉద్దేశం. తమ వాటాలోంచే కళ్యాణి వచ్చినా, బంధువులు వచ్చినా, మనవలూ, మనవరాళ్లూ మరోసారి తిన్నా. ఇది చాలా చిన్న సమస్యలాగే కనిపించినా, తమ వాటా గబగబా

## పాపం, సుమన్ కొత్త బాయ్ ఫ్రెండ్!

కొంత కాలం క్రితం బాలీవుడ్ నటి తన మోడల్ బాయ్ ఫ్రెండ్ గౌతమ్ కపూర్‌ను వదిలేసి, మరో యువకుడి వెంట పడింది. అతనూ మోడలే. పేరు శావార్ అలీ. ఇటీవలే బాలీవుడ్‌లోకి ప్రవేశించాడు. పేరుకిద్దరూ ఫ్రెండ్సే అయినా, తరచూ కలహిస్తుంటారట. అందుకేనేమో, శావార్, తన మిత్రులతో "ఏంటోనబ్బా, మా ఈ రొమాన్స్ ఎంత కాలం సాగుతుందో నాకు తెలియటం లేదు. ఎందుకంటే మేమిద్దరం విపరీతంగా గొడవ పడుతుంటాం" అన్నాట్ట. మరెలాగో?



ఖర్చయిపోయేది. ఏ ెద ి సా తిం దావ ున్నా ''అప్పుడె అయిపోయాయా? మొన్నేగా చేసిందీ. ఈ వయసులో అతి పనికిరాదు" అని పెద్దకోడలు అంటే 'మరే, మరే' అని కొడుకులూ, రెండో కోడలూ తాళాలు వేస్తూంటే తమకీ ఓ గది వుంటే తాము వాళ్లలాగా 'పొట్లాలు' తెచ్చుకుని తినకపోతే పోయే నలుగురి కళ్లల్లో పడకుండా గుట్టుగా కాలక్షేపం చేసేవాళ్లు కదా! అనిపించింది తనకి.

ఇంతేకాకుండా భోజనం కాగానే ఓ చిన్న కునుకు తీస్తే హాయిగా వుంటుంది తామిద్దరికీ. ఆ టైముకి కోడళ్లిద్దరూ పిల్లల్ని బయట పెట్టేసి తలుపులు బిడాయించుకు పడుకుంటారు. ఇంక చెప్పేదేం వుంది?

ఇంక ఇంటికి ఎవరైనా అతిథులు వస్తే సరేసరి. వాళ్లు వెళ్లేదాకా అక్కడా యిక్కడా కాలక్షేపం చేయాల్సి వస్తోంది ఈయన. ఆపైన ఏం మాట్లడదామన్నా ఏకాంతం ఏదీ? అంతా బట్టబయలే. ఇన్నాళ్లకి ఒక అవకాశం వచ్చింది. దీనిని తాను ఎట్టి పరిస్థితులలోనూ వదులుకోకూడదు" గట్టిగా అనుకుంది శ్యామలాంబ.

***

తెల్లారేటప్పటికల్లా రమణ బావమరిదీ, రవి మామగారూ దిగారు. మరి కాస్సేపటికి కళ్యాణీ అల్లుడుగారు.

"ఏమిటమ్మా. వీళ్లంతా వచ్చేరు?" అంది కళ్యాణి.

"అదే నాకూ అర్థం కావడంలేదు." అంది శ్యామలాంబ విస్మయంగా.

కట్టకట్టుకుని అలాగ అందరూ ఎందుకు దిగారో దంపతులిద్దరికీ అర్థం కాలేదు.

భోజనాలు కాగానే మళ్లీ మీటింగు మొదలైంది.

"అమ్మా! 'మాకో గది కావాలని' అడిగావుట కదా! ఈ మాట విన్న దగ్గర్నించీ మా ఆయన ఎంత సంతోషిస్తున్నారో తెలుసా! 'ఆ గది మనకోసమే అయివుంటుంది. మీ అమ్మగారికి మనమంటే ప్రాణం. ఒక్క గదే ఏమిటి? ఇల్లే కట్టిస్తారు' అని మురిసిపోతున్నారు తెలుసా?" అంది కళ్యాణి.

గతుక్కుమన్నారు భగీరథరావుగారూ, శ్యామలాంబా.

"ఔనవ్మూ. మానోట కరక్కాయ కొట్టి నీకే యిస్తారేమో. కట్టకట్టుకు పట్టుకెడుదువుగాని" అంది ప్రభ.

"పెళ్లైన పిల్లవి. ఏది ఇస్తే పట్టుకెళ్లాలి గానీ..." నసిగింది సుమతి.

ప్రేక్షకులులాగ చూస్తూ కూర్చున్నారు దంపతులు.

"నాన్నా! ఇది మరీ అన్యాయం. మావారికి కట్నంగా కూడా పెద్దగా ఏమీ ఇచ్చుకోలేదు. మీ దగ్గర డబ్బు వున్నప్పుడే కదా మా అచ్చటా, ముచ్చటా తీర్చేది? ఇల్లు కాకపోతే కేష్ ఇవ్వండి" అంది కళ్యాణి.

"మేము మరీ అంత సన్నాసుల్లాగా కనిపిస్తున్నామే?" రమణ.

"నాన్నగారూ! ఎక్కడా ఉద్యోగం దొరక్క షాప్ పెట్టుకున్నానన్న సంగతి మీకు తెలియదా? నాకూ కేష్ ఇవ్వండి" రవి.

"బావగారూ! మధ్యలో మాట్లాడుతున్నానని అనుకోకపోతే, స్థలం నాలుగు వందల గజాలుంది కదా! నాకు తెలిసున్న బిల్డరు

ఒకడున్నాడు. అపార్టుమెంట్సు..." అని రవి మావగారు అంటూ వుంటే...

"వద్దండీ బాబూ. మొన్నటికి మొన్న 'డాబా గార్డెన్స్'లో విమల్ షోరూం పక్కన, ఇంకా కన్‌స్ట్రక్షన్‌లో ఉన్నదే కుప్పకూలిపోయాయి. చూళ్లేదూ?" మధ్యలోనే అందుకున్నాడు అల్లుడు.

"జాగ్రత్తగా స్టడీచేసి షేర్లలో పెడితే..." రమణ బావమరిది అన్నాడు.

"అమ్మో! అలాంటి సలహాలు ఇవ్వకండీ. వస్తే వస్తుంది. లేదా మొత్తం కొట్టుకుపోతుంది." అంది కళ్యాణి.

సెపరేట్‌గా తమకీ ఓ రూం కావాలని తాను అడగడం వల్లే కదా, ఇంత 'పంచాయితీ' జరుగుతోంది. పాపం! ఈ వయసులో, ఈయన్ని, నేనూ కూడా, బాధపెడుతున్నానా? అనుకుంది శ్యామలాంబ. అందరికీ పకోడీలూ 'టీ'లూ చేస్తూ.

"ఏమిటి నాన్నా! మీరేం మాట్లాడరేం?" అంది కళ్యాణి.

"అవును నాన్నగారూ! మీ ఉద్దేశం చెప్పండి" అన్నారు రమణా, రవీ.

అప్పుడు నోరు విప్పారాయన.

"నా దగ్గర పది లక్షలున్నాయి. నాలుగు వందల గజాల జాగా వుంది. రెండు వందల గజాల్లో నాలుగు గదులూ, ఒక హాలూ, వంటిల్లూ వచ్చేట్టు ఏ హంగులూ లేకుండా మామూలుగా ఒక అయిదు లక్షల్లో కట్టుకుందాం రమణా! మిగిలిన రెండు వందల గజాల్లో నువ్వు ఇల్లు వేసుకుంటావు. నీ యింటి మీద రవీ, నా యింటిమీద కళ్యాణీ యిళ్లు వేసుకోవచ్చు.

రవీ! ఆర్థిక ఇబ్బందుల వల్ల నీవుగానీ ఇల్లు కట్టుకోకపోతే, మా తదనంతరం, అన్నయ్యకీ, చెల్లికీ చెరో లక్షా ఇచ్చి నేను కట్టే పోర్షను మీద హక్కు పొందవచ్చు. అలాకాక మీ యిద్దరిలో ఎవరు ఈ యింటిమీద హక్కు పొందాలన్నా ఇంటికి వేల్యూ కట్టించి మూడు వాటాలు వేసి ఒక వాటా వారుంచుకుని మిగిలిన రెండు వాటాలూ, మిగిలిన ఇద్దరికీ ఇచ్చి పొందవచ్చు.

"ఇక మిగిలిన డబ్బు..." నసిగాడు రవి.

"ఆ. ఆ విషయానికే వస్తున్నా. అది మీ ముగ్గురికీ, మీ అమ్మకీ, నాకు సమానంగా పంచుతాను."

"పెద్దాయనకి మతిపోయింది. ఆవిడకి గది కట్టిస్తే కట్టించారు. గానీ, లక్షరూపాయలు డబ్బు ఎందుకు?" అంది ప్రభ రసహ్యంగా సుమతితో.

"ఇప్పుడు గానీ ఎందుకూ అన్నామంటే, మొత్తమంతా ఆవిడకే కట్టబెట్టగలడీ మహానుభావుడు." అంది సుమతి నెమ్మదిగా.

ఎవరికీ ఈ నిర్ణయం మింగుడుపడకపోయినా, ఇందులో అన్యాయం కనబడకపోవడంవల్ల నోరు విప్పడానికి అవకాశం దొరకలేదు.

మళ్లీ భగీరథరావుగారు "అమ్మకి లక్షరూపాయలు ఎందుకు? ఏం చేసుకుంటుందీ? అనుకోవద్దు. ఆవిడ స్వతంత్రంగా మెసల గలిగేందుకు ఓ గదికోసం ఒక జీవితకాలం పోరాడింది. అలాగే ఆవిడకి 'ఆర్థిక స్వాతంత్ర్యం కూడా కల్పించడం నా బాధ్యత' అనుకుంటున్నాను" అని అంటూ వుంటే నోటమాట రాక ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైంది శ్యామలాంబ. ■